ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
ఆదివారం 14 సెప్టెంబరు 2025



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి ఫీడర్‌లోని 11 కేవీ లైన్‌కు దగ్గర ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సుందర్ తెలిపారు. హబ్సీ పూర్, సోమన్‌పల్లి, సంఘంపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ తెలిపారు.

● **కోరుట్ల:** పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కోరుట్ల అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ రఘుపతి తెలిపారు. పట్టణంలోని విజయ్ ఇడ్లీ సెంటర్, లక్ష్మీ థియేటర్, గీతాభవన్, ఆనంద్ నగర్, నక్కల గుట్టు, కల్లూర్ రోడ్డు, జాన్సీ రోడ్డు, త్రిశక్తి దేవాలయం, రైల్వే స్టేషన్, అభయాంజనేయ దేవాలయం, పాత మున్సిపల్ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● **మల్లాపూర్:** మండలంలోని ధర్మారం, సాతారం, గుండంపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యాసంవత్సరానికిగాను మిగిలిన ఎస్సీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నామని ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ అర్హత కలిగిన విద్యార్థినిలు ఈనెల 15, 16, 18, 19 తేదీల్లో కళాశాలలో అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటి వరకు అడ్మిషన్లు పొందని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీలత కోరారు.

టెట్.. టెన్షన్



- సుప్రీం తీర్పుతో ఉపాధ్యాయుల్లో ఆందోళన
- సీనియర్ ఉపాధ్యాయులకు సైతం టెట్ పరీక్ష తప్పనిసరి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని వినతి
- పునఃసమీక్షిస్తేనే మేలు అంటున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో సుమారు 1400పైగా టీచర్లపై ప్రభావం

జగిత్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఉలిక్కి పడేలా చేసింది. ఐదేళ్లకు పైబడి సర్వీస్ ఉన్న ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు రెండేళ్ల లోపు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కానిపక్షంలో ఉద్యోగాన్ని వదులుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత తమ జీవితాన్ని విద్యారంగానికి అంకితం చేసిన టీచర్లను తక్షణమే పరీక్ష రాయాలని, లేకుంటే ఉద్యోగం కోల్పోవాలనే నిర్ణయం అన్యాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెట్ చట్టబద్ధతపై 2010 నోటిఫికేషన్ నేపథ్యం....

టెట్ అర్హతపై 2010 ఆగస్టు 23న నెషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీఈటీ) కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉతీర్ణత తప్పనిసరిగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో జారీకి ముందు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చింది. 2010కు ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు ఈ పరీక్ష నుంచి తప్పించబడ్డారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగానే గత పదిహేనేళ్లుగా పాలక ప్రభుత్వాలు ఉపాధ్యాయ నియామకాలు చేస్తున్నాయి.

రెండేళ్ల గడువుతో టీచర్లలో ఆందోళన...

రెండేళ్లలోపు టీచర్లు టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఆదేశం ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది సీనియర్లు దశాబ్దాల తరబడి పాఠశాలల్లో బోధన చేస్తున్నారు. ఇప్పుడు వయసు, ఆరోగ్య సమస్యలు, ఇంటి బాధ్యతలు వంటి కారణాలతో మళ్లీ పరీక్షకు సిద్ధమవ్వడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి లక్షలాది మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు హాజరు కావాల్సి వస్తే నిర్వహణకు సంబంధించిన సమస్యలు ఎదురువుతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు. టెట్ అర్హత వద్దే వద్దంటూ ఉపాధ్యాయ సంఘాలు, నిపుణులు ఒకే స్వరం వినిపిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కోరుతున్నారు. 2010 నోటిఫికేషన్ కంటే ముందు..

(మిగతా 8వ పేజీలో..)

రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



డిగ్రీ, బీఈడీతో ఎస్‌జీటీగా అపాయింట్ అయిన వారికి ప్రస్తుతం టెట్ పేపర్-1 రాయడానికి అర్హత ఉండదు. అయితే ఎన్‌సీటీఈ లోగడ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం వీరికి ఆరునెలల స్వల్ప కాలిక ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చిన తర్వాత పేపర్-1 కి అర్హత లభిస్తుంది. దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలి.

గందరగోళానికి దారితీస్తోంది
బైరం హరికిరణ్, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



2009 తర్వాత నియమించబడిన ఉపాధ్యాయులు వచ్చే రెండు సంవత్సరాల్లో టెట్ ఉత్తీర్ణత పొందకపోతే, ఉద్యోగం కొనసాగించలేరని, ప్రమోషన్లకు అర్హత ఉండదని సుప్రీంకోర్టు నిర్ణయం విద్యావ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. టెట్ అర్హత తప్పనిసరి నిర్ణయం గందరగోళానికి దారితీస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని, న్యాయ నిపుణులతో సంప్రదించి, ఉపాధ్యాయులకు మేలు చేకూర్చే విధంగా నిర్ణయం తీసుకోవాలి.

రాజీ మార్గమే రాజమార్గం
జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి



లోక్ అదాలత్‌లో ఏకమైన వెంకటేష్-హరిత దంపతులు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. జగిత్యాల కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలోనే నేరాలు ఎక్కువగా జరుగుతాయని, చేసిన తప్పును ఒప్పుకోవడానికి మించిన ప్రాయచిత్తం లేదన్నారు. కక్షిదారులు క్షమాగుణం కలిగి క్షమిస్తే చాలా కేసులు పరిష్కారబడుతాయన్నారు. లోక్ అదాలత్‌లో పలు కేసుల్లో రాజీ కుదుర్చి బాధితులకు నష్ట పరిహారం చెల్లించారు. నిర్మల్ జిల్లా కడెం మండలం చిట్యాల గ్రామానికి చెందిన హరితకు రాయికల్ మండలం ఇటిక్యాలకు చెందిన వెంకటేష్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం అనంతరం నాలుగేళ్ల క్రితం కుటుంబ కలహాలు జరుగడంతో వరకట్నం వేధింపుల కేసుతో దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. శనివారం నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో విడిపోయిన జంట తమ తప్పును తెలుసుకుని పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఏకమయ్యారు. ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో పూల దండలు మార్చుకున్నారు. వీరితో పాటు పట్టణానికి చెందిన ముస్తఫా-షిరీన్‌ల జంట ఏకమై పూల దండలు మార్చుకోవడంతో న్యాయమూర్తితో పాటు న్యాయవాదులు అభినందించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 3084 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు



బొడ్డెమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బొడ్డెమ్మ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దంభట్ల వారి వీధి, శ్రీ రామానందేశ్వర (బొజ్జ వారల) వారి వీధి ఆధ్వర్యంలో వేర్వేరుగా నెలకొల్పిన బొడ్డెమ్మ (జేష్ట మహాలక్ష్మి)ను అత్యంత భక్తి శ్రద్ధలతో మహిళలు పూజించారు. నదీ తీరాన సనాతన, సాంప్రదాయ రీతిలో ఆటలు ఆడుతూ, మరొక సారి పూజల అనంతరం బొడ్డెమ్మను గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ 3. 4 వ వార్డుల మాజీ కౌన్సిలర్లు సంగనభట్ల సంతోషి, పురాణపు కిరణ్మయి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలు ఒజ్జల సౌజన్య, శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మధ్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి భావి శోభారాణి, గుండి రమాదేవి, రమావాణి, బొజ్జ పుష్ప, సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినాన్ని ఘనంగా నిర్వహించాలి

భీమారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాగం శివ కుమార్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు హాజరై పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసే బాధ్యత గ్రామాల్లోని కార్యకర్తలపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నాడి జలపతి రెడ్డి, సత్యం, రెబ్బాసు మల్లయ్య, మల్యాల మారుతి, రాము, లింగం, తిరుపతి, సంతోష్, సాయిరెడ్డి, జంగ మధు, జలపతి రెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

భీమారం మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆదేశాల మేరకు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాచకొండ వేణు, దుంపెట తిరుపతి రాజ్, బొర్రగండ్ల గంగు, గోపు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వడ్లకొండ రాము, కోటగిరి లింగం గౌడ్‌లను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శులుగా వనపర్తి చిన్న రాజు, బొల్లె అనిల్, చెట్‌పెల్లి రాజేష్, అనిల్‌రావు, కోశాధికారిగా బద్దం జలపతి రెడ్డితో పాటు 33 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం ప్రభుత్వ పాఠశాలకు చెందిన కుంచపు వైశాలి, సిరికొండస్పందన, భోదాసు ఇందు, అల్లెపు శరణ్య, కుంచపుదీపిక, ఆదరవేణి రవళి, సువంకిపాల్, భోదాసురాధికలు జిల్లా స్థాయి పాఠశాలల పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో మహంకాలి నిశంత్, మ్యాకల అభి, భోదాసు సాత్విక్, పటం రాంచరణ్, అల్లెపు స్వామి, ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగు సత్తయ్య తెలిపారు. విద్యార్థులను పీడీ కోటేశ్వర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

●జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు బాలికల విభాగంలో 8, బాలుర విభాగంలో 10 మంది విద్యార్థులు మండలస్థాయి క్రీడ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సరితాదేవి తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నగేష్, పీడీలు వినీత్, అజీమ్‌లు అభినందించారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్ అమలు



నిందితుడు శ్రీకాంత్‌కు పీడీ యాక్ట్ ఉత్తర్వు కాపీని అందజేస్తున్న సీఐ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన బండి శ్రీకాంత్ అనే వ్యక్తి తరచుగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో గతంలో రౌడీషీట్ ఓపెన్ చేసి పట్టణ పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ శ్రీకాంత్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ కరుణాకర్ శనివారం పీడీ యాక్ట్ అమలు చేశారు. కరీంనగర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌కు పీడీ యాక్ట్ ఉత్తర్వు కాపీని అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీకాంత్ హత్య, హత్యాయత్నాలు, దోపిడీలు, బెదిరింపులు సహా 20 కేసులో నిందితుడిగా ఉన్నాడన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం పీడీ యాక్ట్ పెట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. పీడీ యాక్ట్ అమలు చేయడంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ రఘుచందర్, సీఐ కరుణాకర్‌లను ఎస్పీ అభినందించారు.

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శివకుమార్

రాయికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా రాయికల్ పట్టణానికి చెందిన బొద్దుల శివ కుమార్‌ను నియమిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ భాను, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిలు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో నియామక పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా రాయికల్ పట్టణ, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వినూత్న రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట ప్రణయ్, ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల పోరాటం'

కోరుట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నవాబ్‌తో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం నడిపింది కమ్యూనిస్టులేనని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించి కార్మిక నాయకులతో కలిసి అరుణ పతాకం ఎగరవేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడారు. సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగాలు చేశారని పేర్కొన్నారు. నిజాం, జమీందార్లు దోపిడీ నుంచి 3వేల గ్రామాల్లో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు అందించడం జరిగిందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన తెలంగాణ పోరాటాలను కొన్ని రాజకీయ పార్టీలు మతం రంగులు పులుముతున్నాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యమంలో అమరులైన వారికి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల పట్టణంలోని 9వ వార్డులో కోటి 25 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు మరియు మురికి కాలువ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రామాలయం నుంచి కెనాల్ వరకు కోటిన్నరతో రోడ్డు పునరుద్ధరణ చేశామన్నారు. దరూర్ క్యాంప్‌లో నూతనంగా సెల్ఫ్ ఎంప్లాయ్ మెంట్ ట్రైనింగ్ సెంటర్, ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మాణం జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, గోలి శ్రీనివాస్, ఒద్ది శ్రీలత, రాంమ్మోహన్, అడు వాల లక్ష్మణ్, మాజీ రామాలయం చైర్మన్ బ్రహ్మాండభేరి నరేష్, బాలె శంకర్, గౌరిశెట్టి హరీష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి కృషి

పెన్షనర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం నూతనంగా ఎన్నికయిన పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న హరి అశోక్ కుమార్, పిసి హన్మంతరెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, తదితరులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో డిండిగాల విఠల్, కట్ట గంగాధర్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు
జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ 8లో..
కొండగట్టులో భక్తుల సందడి 7లో..
వాగులో పడి యువకుడి మృతి 6లో..

పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో సంఘమిత్ర (శివాజీ) యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి నవరాత్రోత్సవాల పోస్టర్‌ను శని వారం శివాజీ విగ్రహం వద్ద సంఘం సభ్యులు ఆవిష్కరించారు. వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

●సంఘమిత్ర మహిళా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎద్దండి నివేదితరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పాతూరి కావ్య రెడ్డి, కోశాధికారిగా బొడుగం భావనరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడి సనజ రెడ్డిలను ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

మల్లాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చిట్టాపూర్, సిర్పూర్, మల్లాపూర్ సొసైటీలలో నియమించబడిన ప్రత్యేకాధికారులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిట్టాపూర్, సిర్పూర్ సొసైటీలలో మెట్‌పల్లికి చెందిన సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ మోరపాక శ్రీనివాస్, మల్లాపూర్‌లో జగిత్యాలకు చెందిన అసిస్టెంట్ రిజిస్టర్ ఎండి అసద్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు రవితేజ, రాజేశ్వర్‌రెడ్డి, పాదం భూమేష్ సిబ్బంది ఉన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి
రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత



వాసవి మాత చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న కాల్వ సుజాత

మల్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి సర్కారు కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత అన్నారు. శని వారం మల్యాల ఎక్స్ రోడ్డులో గల బంకెట్ హాల్‌లో వాసవి ట్రస్ట్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యాయ ఉత్సవ్-2025 పేరిట 250 మంది ఆర్యవైశ్య ఉపాధ్యా యులు, అధ్యాపకులకు సన్మాన మహోత్స వాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాల్వ సుజాత వాసవి మాత చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్య వైశ్యుల సంక్షేమానికి, సంఘాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ. 25 కోట్ల నిధులను కేటాయించారన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందన్నారు. సేవా భావంతో వాసవి ట్రస్ట్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో వాసవి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పబ్బ శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, మాజీ అధ్యక్షుడు కొత్త సురేశ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, ఆర్‌టీఏ సభ్యుడు కంటాల శ్రీనివాస్, మెట్‌పల్లి, జగిత్యాల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మైలారపు రాంబాబు, పూటూరి నవీన్, పల్లెర్ల రాజు, నూనె శ్రీనివాస్, దువ్వ రాజు, గుండ శ్రీకాంత్, కాసం రాజశేఖర్, సునీల్, పిప్పరి శ్రీనివాస్, ఈశ్వర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దువ్వ లావణ్య రాజు, పిప్పరి అనిత, అవోపా జిల్లా అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్, వేములవాడ ఆర్యవైశ్య సత్రం చైర్మన్ బుస్స శ్రీనివాస్, యాంసాని సంతోష్, ఇతర ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

రాయికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని అన్ని వార్డుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పట్టణ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి, బీజేపీ జిల్లా మీడియా ప్రతినిధి, సేవా పక్షం రాయికల్ పట్టణ ఇన్‌చార్జి భూమి రమణలు పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూసెప్టెంబరు 17న నరేంద్ర మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి, తెలంగాణ విమోచన దినోత్సవం, గాంధీ జయంతి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు భూమేష్, బన్న సంజీవ్, ఉపాధ్యక్షులు కడార్ల శ్రీనివాస్, తోపారపు ఆశన్న, ఎల్లాగౌడ్, సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, అశోక్, ఆసరి మల్లేష్, సతీష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఎండపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజారాంపల్లి గ్రామానికి చెందిన మ్యాకల నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్‌రెడ్డి, సంగ రమేష్, సొంశెట్టి రమేష్, గెల్లు శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి యువకుడి మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన వీరవేణి రాజ్‌కుమార్ (22) అనే యువకుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్‌వాడకు చెందిన వీరవేణి రాజ్‌కుమార్ కమలా పూర్‌లోని ఫిల్టర్ బెడ్‌లో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి పనికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి వీరవేణి అమృత శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు రాజ్‌కుమార్ కోసం వెతుకుతుండగా మృతదేహం శనివారం ఉదయం వాగులో కనిపించింది. రాజ్‌కుమార్ తన విధుల్లో భాగంగా కమలాపూర్ చివరిలో గల ఫిల్టర్ బడ్ వద్దకు చేరుకునే క్రమంలో వాగులో ప్రమాద వశాత్తు పడి మృతి చెందాడు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


తాళ్ల కార్తిక్(ఫైల్)

గంగాధర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంగాధరర మండల కేంద్రానికి చెందిన తాళ్ల కార్తీక్ (19)యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం తాళ్ల కార్తీక్ కొంతకాలంగా మద్యానికి బానిసై తరుచు కుటుంబసభ్యుతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో గతంలో కుటుంబసభ్యులతో గొడవ పడి డిష్ వైర్‌తో ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈనెల 12న తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాడు. రాత్రి అతిగా మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవ పెట్టుకుంటూ ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించాడు. రాత్రి అందరు ఎప్పటిలాగే పడుకుని తెల్లారి లేచి చూసే సరికి గదిలో మరణించి ఉన్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విచారణలో భాగంగా చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ ఎస్సై వంశీకృష్ణ, కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంటు ప్రొఫెసర్ శేఖర్‌రావు, వైద్య బృందం గంగాధరలో ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాదవశాత్తు గాయపడ్డ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గద్దపాకలో ప్రమాదవశాత్తు గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గద్దపాక గ్రామానికి చెందిన నిమ్మరాజు రాజు (55) అనే వ్యక్తి ఈ నెల 9న రాత్రి నీళ్లు తాగడానికి లేచి నిద్రమత్తులో నీళ్లు తాగుతుండగా కాలు జారీ ఇంట్లో ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతిడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలల్లో కానరాని క్రీడలు

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- అలనాటి క్రీడలు కనుమరుగు


కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అలనాడు ఆడిన ఆటలు పాఠశాలల్లో నేడు కానరావడం లేదు. గతంలో ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుకునే విద్యార్థులు 7నుంచి 10వ తరగతి వరకు పీఈ టీలు ఉండేవారు. ప్రైవేటు పాఠశా లలు లేని కారణంగా అందరూ ప్రభు త్వ పాఠశా లల్లోనే చదువుకునేవారు. దీంతో ఒక్కొక్క క్లాసులో వంద నుంచి 120మంది విద్యార్థుల వరకు ఉండేవారు. కాగా వారిని మూడు భాగాలుగా విభ జించి ఉపాధ్యాయులు క్లాసులు బోధించేవారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల సమయం నుంచి 5.30గంటల సమయం వరకు పీఈటీలు విద్యార్థులకు ఆటలు ఆడించేవారు. గతంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, అథ్లెటిక్స్, జావెల్‌త్రో, టేబుల్ టెన్నిస్ తదితర ఆటలు పీఈటీలు ఆడించేవారు. ఆటల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఆడించిన సంఘటనలు ఉన్నాయి. గ త ం లో ఉపా ధ్యాయులు స్థానికంగా ఉం డటం ఒక కారణమైతే, పాఠశాలకు సమయాని కంటే ఒక గంట ముందే వచ్చేవారు. అలాగే పాఠశాల అయిపోగానే విద్యార్థులతో కలిసి సాయంత్రం ఆటలు ఆడేవారు. ప్రస్తుతం ఉపాధ్యా యులు సుదూర ప్రాంతా లైన హనుమకొండ, కరీం నగర్, పెద్దపల్లి, జమ్మి కుంట తదితర పట్టణాలనుంచి వస్తూ, హడావుడిగా వెళ్లిపోతున్నారు. గతంలో ఉపాధ్యాయులు స్థానికంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పలుక్రీడలు ఆడేవారు. మండల కేంద్రంలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన పీఈటీ సంపత్ కుమార్, మైన య్య, ఇంద్ర సేనారెడ్డి, కూనారంలో రాజ నర్సులు ఇలా పలువురు వ్యాయా మ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆటలు నేర్పించి, ఆ విద్యార్థులను జాతీ య స్థాయి క్రీడల్లో ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు పలువురు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ కొలువుల్లో పని చేస్తున్నారు. మండలంలో 11 ఉన్నత పాఠశాలలు ఉన్నా కేవలం ఆ పాఠశాలల్లో 312 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఏడు వరకు ఉన్న 34ప్రభుత్వ పాఠశాలల్లో 1147మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే 179మంది ఉపాధ్యాయులు మండ లంలోని ఆయా పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారు. కాల్వ శ్రీరాంపూర్, పెగడపల్లిలో ఇద్దరు పీఈ టీలు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో విద్యార్థులు సాయంత్రం 3గంటల వరకు ఆయా సబ్జెక్టుల్లో విద్యాబోధన, అనంతరం ఆ తదుపరి ఆటలు ఆడటం వల్ల మానసికంగా విద్యతోపాటు శారీరక శ్రమ అలసటతో విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండేవారు. గతం లాగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు విద్యార్థులకు వారి ఇష్టమైన ఆటలు ఆడించేలా మైదా నంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి క్రీడల్లో జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని మండల ప్రజలు తమ అభిప్రాయలను వ్యక్తం చేస్తున్నారు.





రాష్ట్రస్థాయిలో ఖోఖో ఎన్నోసార్లు ఆడాను..



- సబ్బని శ్రీనివాస్, పూర్వవిద్యార్థి, పెగడపల్లి

కాల్వశ్రీరాంపూర్ ఉన్నతపాఠశాలలో తాను 1982లో 10వతరగతి వరకు చదువుకున్నాను. చదువుతోపాటు ఆటలు ఆడుకునేవాళ్లం. ఖోఖోలో రాష్ట్రస్థాయిలో ఆడాను. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామీణ క్రీడలు కానరావడం లేదు.

జాతీయ స్థాయిలో కబడ్డీ ఆడాను..



- అల్లం దేవెందర్, పూర్వవిద్యార్థి, కాల్వశ్రీరాంపూర్

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999లో 10వ తరగతి వరకు చదువుకున్నా. నేను కబడ్డీలో జాతీయస్థాయిలో ఎంపికై ఢిల్లీలో కూడా కబడ్డీ ఆడాను. తాము చదువుకునే సమయంలో గ్రామీణ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఉండేది. ప్రస్తుతం పాఠశాలల్లో ఆటలు కానరావడం లేదు.

పురుగుల మందు డబ్బాతో వ్యక్తి ఆందోళన

హుజూరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దాసరి సదానందం అనే వ్యక్తి ఆస్తిలో వాటా డబ్బులు ఇవ్వకుండా సోదరులు తనని ఇబ్బంది పెడుతున్నారని శనివారం పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సదానందంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరులు ఉమ్మడి ఆస్తి విక్రయించగా తనకు ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలన్నారు. తన కూతురు వివాహం ఉన్నందున డబ్బులు ఇవ్వమంటే తన అన్నదమ్ములు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీంతో తాను ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గూడూరి మనోహర్‌పై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈనెల 12న అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న క్రమంలో పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని మనోహర్‌కు 14 రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

యువకులకు గంజాయి పరీక్షలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని పలు ఇళ్లలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు శనివారం సోదాలు నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇద్దరు అనుమానిత యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రాపిడ్ పరీక్షలు నిర్వహించామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఖాతాలో నుంచి రూ.70 వేలు మాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరస్థులు అదును దొరికితే చాలు.. అమాయకుల ఖాతాల్లోంచి డబ్బులను క్షణాల్లో మాయం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఓ వ్యక్తి ఇటీవల ఏఐ ట్రెండ్‌తో వచ్చిన యాప్‌లో తన ఫోటోను అప్‌లోడు చేశాడు. ఆ క్రమంలో సదరు వ్యక్తి సెల్‌ఫోనుకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేయడంతో సైబర్ నేరస్థులు ఆయన ఖాతాలో నుంచి రూ.70వేలను మాయం చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నారు.

తాళం పగలగొట్టి.. పట్ట పగలే చోరీ

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో తాళం పగలగొట్టి పట్ట పగలే చోరీ చేసిన సంఘటన శనివారం శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో జరిగింది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లి గ్రామానికి చెందిన బియ్యాల కృష్ణ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి వ్యక్తిగత అవసరాల నిమిత్తం కరీంనగర్ వెళ్లగా, కుటుంబ సభ్యులు అదే గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి ఇంటర్నెట్ షాపు నిర్వహణకు ఉపయోగించే లాప్‌టాప్, ఇన్వర్టర్ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. వాటి విలువ సుమారు 30వేల రూపాయల వరకు ఉంటుందని, చోరీపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. కాగా గ్రామంలోని మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించినట్లు సమాచారం.

గంజాయి అమ్మినా, కొన్నా కఠిన చర్యలు

- అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వండి - గోదావరిఖని ఏసీపీ మడక రమేష్


కాలనీవాసులతో మాట్లాడుతున్న గోదావరిఖని ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని గోదావరిఖని ఏసీపీ మడక రమేష్ హెచ్చరించారు. గోదావరిఖని రాంనగర్, సీతానగర్, కృష్ణనగర్, లెనిన్‌నగర్, 2ఏ మోరీ, ఆర్‌సీఓఏ క్లబ్ ప్రాంతంలో శనివారం ఏకకాలంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను సోదా చేయడంతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసే కూలీలు ఎక్కువ మంది నివసిస్తున్నారని, వారికి కిరాయి ఇళ్లు ఇచ్చే వారు వారి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. యువత గంజాయికి బానిసలవుతున్నారని, గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయించినట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మైనర్లకు మోటార్‌సైకిల్ ఇవ్వవద్దని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేసి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవద్దని సూచించారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. తనిఖీల్లో గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, ఎస్‌ఐలు రమేష్, భూమేష్, అనూష, నవీన్, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కట్ల సతీష్ కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడు నెలల్లో మూడింతలు డబ్బులు వస్తాయని పలువురి వద్ద కోటి రూపాయలకుపైగా వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో గురువారం నమోదైన కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్ల సతీష్‌ను పోలీసు కస్టడీకి అనుమతించాలంటూ కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో కట్ల సతీష్‌ను శుక్రవారం అరెస్టు చేసి జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు నిందితుల్లో మరో ఇద్దరు పరారీలో ఉండగా ఇద్దరిని ఇప్పటికే సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయితే క్రిప్టో కరెన్సీ మెటాఫండ్ పేరిట ఫేక్ ఐడీలు సృష్టించి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు బాధితులు కరీంనగర్ రెండో ఠాణా, కరీంనగర్ రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి మరింత లోతుగా విచారణ చేయాల్సి ఉందని, నిందితుడు కట్ల సతీష్‌ను నాలుగు రోజులు పోలీసు కస్టడీకి అనుమతి ఇవ్వాలని పోలీసులు పిటీషన్ దాఖలు చేశారు. ఫేక్ క్రిప్టో కరెన్సీ దందాలో వ్యాపారులు, సామాన్య ప్రజలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులుకూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 100 కోట్లపైగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో కస్టడీకి తీసుకుని పెట్టుబడిపెట్టిన వ్యక్తుల వివరాలు తెలుసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత


బోయినపల్లిలో పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

బోయినపల్లి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండల కేంద్రంలోని ఒక పాత ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు వెంటనే అక్కడికి వెళ్లి కోనరావుపేట మండలం కొండపూర్ గ్రామానికి చెందిన పెద్దగంటి అంజయ్యను పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీణవంక: మండల కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్నారన్నా సమాచారం మేరకు లోకిని స్వామి ఇంటిపై పోలీసులు దాడి చేయగా 12 బస్తాల బియ్యం బస్తాలు లభించినట్టు పోలీసులు తెలిపారు. దాదపు ఐదు క్వింటాళ్ల బియ్యం అక్రమ రవాణకు సిద్ధంగా ఉండడంతో వాటిని పట్టుకొని లోకిని స్వామిపై కేసు నమెదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని గొల్లపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను శనివారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదుపు తప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇటుక ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి శనివారం బోల్తా పడింది. గ్రామస్థుల సమాచారం మేరకు మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామం నుంచి ఇటుకను ట్రాక్టర్‌లో శంకరపట్నం మండలం ధర్మారంలో ఇంటి నిర్మాణానికి తరలిస్తున్నారు. ధర్మారం గ్రామ శివారులో భారీ వర్షాలతో రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయలు కాలేదు.

దేవాలయాల్లో వరుస దొంగతనాలు

- వారం వ్యవధిలో మూడు ఆలయాల్లో చోరీ


గోపాల్‌రావుపేట గుడిలో హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన నిందితులు

ధర్మారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల వ్యవధిలో మూడు దేవాలయాల్లో వరుస దొంగతనాలు జరిగిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి నందిమేడారంలోని అమరేశ్వరస్వామి దేవాలంలోకి చొరబడిన దొంగలు గుడి తాళాలు పగుల గొట్టి హుండీ ఎత్తుకెల్లారు. గుడిచెర్మన్ పోలీసులకు ఇచ్చిన సమాచారంతో కానిస్టేబుల్ రాజు ఆలాయానికి వచ్చి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈనెల ఏడో తేదీన ఆదివారం రాత్రి గోపాల్‌రావుపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా దొంగలు పడి హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. దీనితో పాటు 10న, బుధవారం రాత్రి మేడారం ఎస్సీ కాలనీలో మేన్‌రోడ్‌కు ఆనుకొని ఉన్న హనుమాన్ టెంపులో కూడా దొంగలు హుండీ పగులగొట్టి నగదు దోచుకెళ్లినట్లు సమాచారం. ఇన్ని వరుస సంఘటనలు జరుగుతున్నప్పటికీ ఆయా గ్రామాల్లోని ప్రజలకు కూడా గుడిలో దొంగలుపడినట్లు తెలియపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెల్గటూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ధర్మారం మండలం మేడారం, కటికెనపల్లికి చెందిన వెంకటేష్, సంతోష్, మల్లేష్ అనే యువకులు ద్విచక్రవాహనంపై వెల్గటూర్ వైపు నుంచి ధర్మారం వైపు వెళ్తుండగా అదుపు తప్పిపడిపోయింది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

జీడీకే 11 ఇంక్లైన్ బొగ్గుబాయిపై దొంగతనం

- రూ.10 లక్షల సామగ్రి అపహరణ
- ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు?

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం జీడీకే 2ఇంక్లైన్‌లో దొంగలు పడ్డ సంఘటన మరువక ముందే ఇదే ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే ఇంక్లైన్‌లో భారీ దొంగతనం జరిగింది. గనిలోని లాంగ్‌వాల్ షెడ్‌లో చోరీ జరిగినట్టు రెండు రోజుల క్రితం అధికారులు గుర్తించారు. దీంతో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు సమాచారం. 11ఇంక్లైన్ లాంగ్ వాల్‌షెడ్ స్టోర్‌లో పైకప్పు రేకులు తొలగించి లోపలికి చొరబడిన దొంగలు విలువైన కాపర్ కేబుళ్లు, విలువైన ఇత్తడి సామగ్రిని దొంగించినట్టు అధికారులు గుర్తించారు. దొంగిలించిన సామగ్రి విలువ రూ.10లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.


జీడీకే 11ఇంక్లైన్ స్టోర్ పైకప్పు రేకులు పగుల గొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

తెగిపోయిన ఇందుర్తి ఎల్లమ్మ వాగు రోడ్డు

- పట్టించుకోని అధికారులు - మరమ్మతులు చేసిన ప్రయాణికులు


తెగిన రోడ్డును మర్మత్తు చేస్తున్న ప్రయాణికులు


రోడ్డు తెగిపోవడంతో వెనుదిరిగి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

చిగురుమామిడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి ఎల్లమ్మ వాగు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో కోహెడ-చిగురుమామిడి మండలాల ప్రజల రాకపోకలు నిలిచి పోయాయి. అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా మండలాల ప్రజలు అదికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు స్వయంగా శ్రమదానం చేసి రోడ్డును మరమ్మతు చేశారు. ఇదే సందర్భంలో అక్కడికి వచ్చిన ఆర్టీసీ బస్సు రోడ్డు దెబ్బతినడంతో బస్సు వెనుదిరిగి వెళ్లిపోయింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకొని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్ఎండీలో మత్స్యకారుడి వలకు చిక్కిన 'సిల్వర్ ఫిష్'



తిమ్మాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు మండలంలోని దిగువ మానేరు జలాశయంలోకి వెళ్లిన మత్స్యకారుడి వలకు ఓ అరుదైన చేప చిక్కింది. మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన బోళ్ల భూమయ్య అనే మత్స్యకారుడు చేపలు పట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. రోజు వారిలోగే శనివారం ఉదయం కూడా చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వల వేయగా 20 కిలోల చేప చిక్కింది. ఈ చేపను సిల్వర్ ఫిష్‌గా పిలుస్తారని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇది చైనాకు చెందిన జాతి అని చైనా నుంచి తీసుకువచ్చి మన దేశంలో పెంచుతున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల్లో నాలుగు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ చేపల్లో ముళ్లు అధికంగా ఉంటాయన్నారు. వర్షాలతో, వరదల కారణంగా ఎగువ నుంచి ఈ చేప ఎల్ఎండీలోకి వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇది ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంటుందని మరికొందరు చెబుతున్నారు.

బాలికను వేధించిన వ్యక్తి రిమాండ్

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన వ్యక్తికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంబాలాపూర్ గ్రామానికి చెందిన రావనవేణి హరీష్ ఓ బాలిక వెంబడించి వేధించాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాగా పోలీసులు రావనవేణి హరీష్‌ను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.



- కరీంనగర్, రామగుండంలో ఏర్పాటుకు అనుమతి
- కరీంనగర్ ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 25న చివరి గడువు

ద్వితీయశ్రేణి నగరాల్లో మైక్రో బ్రూవరీలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీరు ప్రియులకు కిక్కిచ్చే మైక్రో బ్రూవరీలు ఇక ద్వితీయశ్రేణి నగరాల్లో ఏర్పాటు కానున్నాయి. బీర్లు కొనుగోలు చేయాలంటే ఇక నుంచి వైన్‌షాపుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధాని వంటి పెద్ద పట్టణాలకే పరిమితమైన మైక్రో బ్రూవరీ యూనిట్లను ద్వితీయశ్రేణి నగరాలు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) కరీంనగర్, రామగుండం వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మైక్రో బ్రూవరీలను ఏర్పాటు చేసుకుని, వ్యాపారం కొనసాగించుకునేందుకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లను జారీ చేయనున్నది. కరీంనగర్, రామగుండంలో మైక్రో బ్రూవరీ యూనిట్లు ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మాత్రమే 18 వరకు మైక్రో బ్రూవరీలు నడుస్తున్నాయి. ఇప్పుడు కరీంనగర్, రామగుండంతో పాటు మరికొన్ని మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్‌లలు, ఎలైట్ బార్‌లు, క్లబ్‌ల వంటి ఇదివరకే లైసెన్స్ కలిగిన ప్రాంగణాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. కొత్త స్థలాల్లోనూ నిబంధనల మేరకు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది.

విధి విధానాలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లలో మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు సెప్టెంబరు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని ఆసక్తి ఉన్న ఔత్సాహికులు దరఖాస్తుతోపాటు లక్ష రూపాయల చలానా, ఆధార్, హోటల్/రెస్టారెంట్/బార్/క్లబ్‌లకు సంబంధించిన జిరాక్స్ కాపీలు జత చేసి దరఖాస్తు కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుంది. హోటళ్లు, రెస్టారెంట్లు వంటివి లేని వారు కొత్తగా మైక్రోబ్రూవరీ యూనిట్ ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి సమర్పించే లక్ష రూపాయల చలాన్ నాన్ రిఫండబుల్‌గా ఉంటుంది. అంటే దరఖాస్తు ఫీజుగా పరిగణిస్తారు. దరఖాస్తులకు, మైక్రో బ్రూవరీలకు పరిమితి లేదు. ఎన్ని కావాలంటే అన్ని యూనిట్లకు ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లు జారీ చేసేందుకు సిద్ధంగా ఉంది. లైసెన్స్ తీసుకున్న తరువాత మైక్రో బ్రూవరీ యూనిట్ ఊర్పాటుకు 180 రోజుల వ్యవధి నిర్దేశించారు. ఈ వ్యవధిలో యూనిట్ ఏర్పాటు చేసుకోనట్లయితే లైసెన్స్ గడువు ముగిసి రద్దు అవుతుంది. వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణంలో యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. 100 చదరపు మీటర్లలో రెస్టారెంట్, 300 చదరపు మీటర్లలో మైక్రోబ్రూవరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. మిగతా స్థలంలో కిచెన్, లాయిలెట్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 250 చదరపు మీటర్లలో పార్కింగ్ స్థలం ఉండాలి. రెస్టారెంట్‌లో ఎయిర్ కండిషన్, ఎయిర్ కూలింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఏడాదికి ఐదు లక్షల ఫీజు చెల్లించాల్సి ఉండగా, కోటి రూపాయలపైగా ఖర్చు అయ్యే మైక్రోబ్రూవరీ యూనిట్ మాత్రం లైసెన్స్‌దారుడే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మైక్రో బ్రూవరీలో తయారు చేసిన బీరును అక్కడే విక్రయించాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల్లో బయట అమ్మేందుకు వీల్లేదు. కాల వ్యవధిలోపు విక్రయం జరగకుంటే ఆ బీరును పారబోయాల్సి ఉంటుంది. కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైక్రోబ్రూవరీల ఏర్పాటు కోసం ఈ నెల 2న నోటిఫికేషన్ జారీకాగా ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు ఆంజనేయస్వామి చుట్టు ప్రదక్షిణలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారలకు అభిషేకాది పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వ ర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథ శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి అర్చకులు అభిషేకం, నిత్య పూజలు నిర్వహించారు. సినీ నటుడు రాజేశ్ శనివారం అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

'యాత్రాదానం'లో భాగస్వాములు కావాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రాదానం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ దేవాలయాలకు పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రలకు తీసుకు వెళ్లవచ్చన్నారు. సమాజ హితానికి ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీవోలు యాత్రాదానం కార్యక్రమంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలను అందిస్తున్న ఆర్టీసీ యాత్రాదానం కింద బస్సుల బుకింగ్ కోసం స్థానిక ఆర్టీసీ డిపో అధికారులను సంప్రదించాలన్నారు. ఆర్టీసీ హెల్ప్‌లైన్ నంబర్లు 04069440000, 04023450033కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఆర్టీసీ అధికారులు యాత్రాదానం టూర్ ప్యాకేజీల వివరాలను అందిస్తారన్నారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా దైవదర్శనం, విహారయాత్రకు యాత్రాదదానం చేయాలని కోరారు.

అంతర్జాతీయ క్రీడా సదస్సుకు అశోక్‌కుమార్



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సుకు ఉమ్మడి జిల్లాకు చెందిన గుగులోత్ అశోక్ కుమార్ ఎంపికయ్యారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్, సైన్స్ ఆధ్వర్యంలో జరగనున్న మొదటి అంతర్జాతీయ సదస్సుకు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయన గతంలో కరీంనగర్‌లో రెజ్లింగ్ కోచ్‌గా, డీవైఎస్‌వోగా విధులు నిర్వహించారు. ఓ రెజ్లింగ్ క్రీడాకారుడిపై ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రీసెర్చ్ చేస్తున్న సందర్భంగా అశోక్‌కు వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సులో పాల్గొననున్నారు. క్రీడారంగంలో విశిష్ట సేవలందించి రాబోయే తరానికి అశోక్‌కుమార్ ఒక స్ఫూర్తిగా ఉండాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి ఆయనను అభినందించారు.

కొండగట్టుకు రావాలని చిన్నజీయర్‌స్వామికి ఆహ్వానం

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి రావాలని ఆలయ అధికారులు, అర్చక బృందం త్రిదండి చిన్నజీయర్‌స్వామిని కోరారు. హైదరాబాద్ ముచ్చింతల్‌లో గల సమత మూర్తి ఆశ్రమంలో కలిసి కొండగట్టులో నిర్వహించనున్న వేడుకలకు రావాలని ఆహ్వానించారు. జీయర్‌స్వామిని కలిసిన వారిలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ఉపప్రధానార్చకులు చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, అర్చకులు తదితరులు ఉన్నారు.

అంజన్న సన్నిధిలో 'కార్పం' సినిమా బృందం

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న నూతన సినిమా కార్పం చిత్రబృందం శనివారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకుంది. చిత్రం స్క్రిప్ట్‌తో స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చిత్రబృందంను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బృందసభ్యులు మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషతో ఇక్కడి సంప్రదాయలను ఈ సినిమాతో తెరకెక్కించనున్నట్లు తెలిపారు. కొండగట్టు ప్రాంతంలో సినిమా షూటింగ్ ఉంటుందని తెలిపారు.

కూతరు అపాయంలో ఉందంటూ సైబర్ నేరస్థుల ఫోన్

- అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

హుజూరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మీ కూతురు ఓ కేసులో ఇరుక్కుంది.. డబ్బులు పంపించాలని ఆనడంతో అప్రమత్తమైన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన హుజూరాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణానికి చెందిన సుస్రత్ కూతురు ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఇంటర్ చదువుతోంది. ఓ పోలీస్ అధికారి డీపీతో సైబర్ నేరగాళ్లు సుస్రత్‌కు ఫోన్ చేసి మీ కూతురు ఓ కేసులో ఇరక్కుందని, రూ. 30 వేలు ఫోన్ పే ద్వారా చెల్లిస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. అప్రమత్తమైన సదరు మహిళ కళాశాలకు వెళ్లి కూతురును కలిసింది. ఈ విషయాన్ని తన భర్తకు తెలపడంతో సైబర్ నేరగాళ్ల పని అని పోలీస్‌స్టేషన్లో టౌన్ సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కిరాణాషాపులో చోరీ

బీర్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీర్‌పూర్ మండలం తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన నల్ల మహిపాల్ రెడ్డి అనే వ్యక్తి కిరాణం షాపులో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. దుండగులు షాపు తాళం పగులకొట్టి కౌంటర్‌లోని నలభై వేల రూపాయలు, అర్థ తులం బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని జీవన్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన జీవన్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళుతున్నాడో, ఏ పని చేస్తాడో తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో శనివారం ఒక ఇంటిపై దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నామని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 21,400 రూపాయలు, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

- 22 గేట్ల ద్వారా దిగువకు 1,14,680 క్యూసెక్కులు నీరు

జగిత్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. శనివారం 22 గేట్లు ఎత్తి 1,14,680 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,32,395 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. 253విఎండి13: మిడ్ మానేరు ప్రాజెక్టు



గోదావరిలోకి పరుగులు పెడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీరు

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) శనివారం 10,600 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 9800, మానేరు ములవాగు ద్వారా 800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400, ప్యాకేజి 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.80 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.042 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

- **అన్నపూర్ణ రిజర్వాయర్‌లో..**

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.04టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6,400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో..

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎల్ఎండీ రెండు గేట్ల ద్వారా 8,309 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు 10,314 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నాయి. ఎల్ఎండీ రెండు గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుఉలు, కాకతీయ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు నీరు అవుట్‌ఫ్లో వెళ్తోందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితే

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అనుబంధమైన శ్రీభీమేశ్వరాలయానికి వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మహేష్ బిగితే అన్నారు. భీమేశ్వరాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో క్యూలైన్స్, వీఐపీ దర్శనం, కోడెమొక్కుల దర్శనం, వీఐపీ రోడ్డు, పార్కింగ్‌స్థలాలు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, టాఫిక్ ఆర్ఎస్ఐ రాజు, ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఏఈ నాగరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





పనులను పరిశీలిస్తున్న ఎస్పీ, సినీనటుడు రాజేశ్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

భీమేశ్వరాలయంలో ఎస్పీ పూజలు

భీమేశ్వరాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎస్పీ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి ప్రసాదం అందజేశారు.

రాజన్నను దర్శించుకున్న సినీనటుడు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని సినీనటుడు రాజేష్ శనివారం దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి రాజన్నప్రసాదం అందజేశారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాల సమావేశం

జమ్మికుంట సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూమిలినియం పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ బెస్ట్ అబైలబుల్ పాఠశాల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. కొన్నిసంవత్సరాలుగా పాఠశాలల కు రావల్సిన బాకాయిలు పెండింగ్ అంశాలపై చర్చించారు. ఇంటర్ మీడియట్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల వలే పాఠశాలల యజమాన్యాలు సైతం సహాయ నిరాకరణ బాటలో పయనించాలని నిర్ణయించారు. ముఖ్య అతిథిగా ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు పాల్గొని మాట్లాడుతూ 18వ తేదీలోపు బకాయిలు చెల్లించని పక్షంలో తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు మునిపట్ల తిరుపతిరెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు పూల్లురి సంపత్‌రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రైవేటు స్కూల్ యజమానులు

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులపై జీఎం అసంతృప్తి

పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో నత్తనడకన జరుగుతున్న అమృత్ స్టేషన్ ఆధునికీకరణ పనులపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన మంచిర్యాల, రామగుండం రైల్వేస్టేషన్లను పరిశీలించిన అనంతరం డీఆర్ఎం రాధాకృష్ణతో కలిసి పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడ 22కోట్ల రూపాయలతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. పనుల్లో ఏమాత్రం వేగం పుంజుకోవడం లేదు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను జీఎం ప్రశ్నించారు. పనుల్లో వేగం పెరగకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను పూర్తి చేసి ప్రయాణికులకు స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌యూసీసీ మెంబర్ ఎన్‌డీ తివారి జీఎంకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఇక్కడ వివిధ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని తివారితోపాటు విష్ణు ప్రకాశ్, మాలని, దీపరాం, పూరారామ్, పన్నాలాల్, నైన్ సింగ్ తదితరులు జీఎంను కోరారు.

రామగుండం రైల్వేస్టేషన్ సందర్శించిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

అంతర్గాం: రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను శనివారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, పార్కు, పార్కింగ్ స్టాండ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే రైల్వేసంస్థ ప్రధానలక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుందనపల్లి, పెద్దంపెట్, కన్నాల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా రామగుండం రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలపాలని కోరుతూ రైల్వేబోర్డు మెంబర్ అనుమాస శ్రీనివాస్ జీన్స్ పలు కార్మిక సమస్యలు పరిష్కరించాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే సంఘ్ యూనియన్ నాయకులు జీఎంకు వినతిపత్రాలు అందజేశా రు. అనంతరం జీఎం రైల్వే అధికారులతో కలిసి గోదావరిఖనిలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, రైల్వే సైడింగ్‌లను తనిఖీచేశారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వేమేనేజర్ గోపాల్‌కృష్ణన్, స్టేషన్‌మాస్టర్ మీనా, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీమన్నారాయణ, రవికుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ లింగమయ్య, యూనియన్ నాయకులు యాదగిరి స్వామి, రాథోడ్ ఆనంద్, అజ్మీరా వీరన్న తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో పనుల మ్యాపులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోరుట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధి లోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో పేకాటాడుతున్న 8 మందిని జిల్లా సీసీఎస్ పోలీసులు శనివారం పట్టుకొని కోరుట్ల పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. పక్కా సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు దాడి చేసి 8 మందిని పట్టుకొని వారి వద్ద రూ. 4,650 నగదుతో పాటు ఎనిమిది సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీపీవోల నియామకం

కథలాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామాలకు గాను 14 రెవెన్యూ క్లస్టర్లకు గ్రామ పాలనాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ కాబడ్డాయని తహసీల్దార్ వినోద్ తెలిపారు. కథలాపూర్ క్లస్టర్‌కు నీరటి గణేశ్, భూషణరావుపేట రత్నాల ప్రశాంత్, పెగ్గెర్ల, ఊట్‌పల్లికి కుంభం ప్రకాశ్, చింతకుంట గోరుమంతుల సుధాకర్, గంభీర్‌పూర్ పిట్ల గజేందర్, అంబారిపేట, తుర్తికి సిహెచ్ భూమేశ్వర్, కలికోట, పోతారం తలారి యశ్వంత్, తాండ్య్రాల కోరెం రాజ్‌పాల్, ఇప్పపల్లి మగ్గిడి ప్రశాంత్, దుంపెట, పోశానిపేట బక్కూరి రాకేశ్, దూలూరు బల్గం అనిల్, సిరికొండ బంటు హరికృష్ణ, బొమ్మెన విద్యాసాగర్, తక్కళ్లపల్లి పొట్ట నర్సయ్యలను నియమించారని వారు విధుల్లో చేరినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు.

హిందీ దివస్ వేడుకలు

రాయికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పద్య పఠనం, నాటకాలు, పాటలు, హిందీలో ప్రసంగాలు, నృత్యాలు, ప్రాజెక్ట్ వర్క్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూపల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహంలో సమావేశం

సారంగాపూర్, సెప్టెంబరు, 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ఎస్సీ బాలుర వసతి గృహంలో పోషకులతో హాస్టల్ వెల్ఫేర్ అధ్యాపకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. హాస్టల్ వేల్ఫేర్ అధ్యాపకులు చంద్రశేఖర్ వసతి గృహంలో విద్యార్థుల కోసం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. వసతి గృహ వసతులను, పరిసరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిపల్లి, తక్కళ్లపల్లిలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్ రావు, నాయకులు కుమారస్వామి, మల్లారెడ్డి, లక్ష్మన్, మిట్టపెల్లి దశరథం, శేఖర్, మహేశ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, గంగాధర్, అజయ్ ఉన్నారు.

‘ఉపాధిహామీ’లో కీలక పోస్టులు ఖాళీ

● ఈసీ, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు లేక పనులకు గ్రహణం

కథలాపూర్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబం ధించిన కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో పనులపై పర్యవేక్షణ చేసే వారు లేక నిలిచిపోయాయి. ఐదేళ్లుగా ఇంజినీర్ కన్సల్టెంట్ (ఈసీ) పోస్టును భర్తీ చేయకపోవడంతో ఇన్‌చార్జితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీవో) ర్యాగళ్ళ రాజేందర్‌ను విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడనే అభియోగంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో కోరుట్ల ఉపాధిహామీ ఏపీవో మమతకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సదరు ఏపీవో కథలాపూర్ రావడానికి నిరాకరించడంతో ఇబ్రహీంపట్నం ఏపీవో కొమురయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఆ ఏపీవో కూడా ఇక్కడ జాయిన్ కాలేదు. ప్రస్తుతం టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉన్న శ్రీధర్‌కు ఈసీగా అదనపు బాధ్య తలు అప్పగించారు. ఈ నేపథ్యంలో పనులను పర్యవేక్షించేందుకు అధికారులు లేకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయం

● కొత్త పనుల గుర్తింపుపై సందిగ్ధం

మండలంలోని 19 గ్రామాలకు ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు ఉండాలి. అయితే కొన్నేళ్ళుగా ఇద్దరితోనే పనులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పనుల పర్యవేక్షణ కష్టతరంగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి గ్రామ సభలు నిర్వహించి కొత్తగా చేపట్టబోయే పనులను గుర్తించాల్సి ఉంది. అటు టెక్నికల్ పోస్టులు, ఈసీ, ఏపీవో, పలు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు కూడా భర్తీ కాకపోవడం వల్ల పనుల గుర్తింపుపై సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం 5 పౌల్ట్రీ ఫాంలు, 15 గొర్రెల షెడ్‌లు, 12 నాడెపు కంపోస్ట్‌లు, 12 క్యాటిల్ షెడ్‌లు, 28 అజొల్లా షెడ్లు, ఇందిరమ్మ ఇళ్లకు ఇంకుడు గుంతలు, రూ.5 లక్షలతో చెక్‌డ్యాం, ఫాం పాండ్‌లు మంజూరు కాగా పనులు మందగించాయి. మండలంలో 9452 జాబ్ కార్డులు ఉండగా 14 వేల మంది కూలీలు ఉన్నారు. ఇందులో రెగ్యులర్‌గా పనులకు సుమారు 5 వేల మంది వస్తుంటారు.

● కూలీలు, సిబ్బందికి వేతనాలు కరువు

ఉపాధిహామీ చట్టం ప్రకారం 15 రోజుల్లోపు కూలీలకు వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే నాలుగు మాసాల నుంచి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు పనులకు రావడానికి విముఖత కనబరుస్తున్నారు. మరోవైపు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించని కారణంగా ఆందోళన చెందుతున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్)తో కూలీల ఫేషియల్ అటెండెన్స్ వేయడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

● పోస్టుల ఖాళీ వల్ల పనుల్లో జాప్యం

-శంకర్‌నాయక్, ఎంపీడీవో, కథలాపూర్



ఉపాధిహామీ పనులపై నిరంతరం అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. ప్రధానమైన ఈసీ, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉపాధి పనులకు కొంత ఆటంకం ఏర్పడుతోంది. ఖాళీలు భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. కొత్తగా చేపట్టబోయే పనులు గుర్తించే ప్రక్రియ ప్రారంభిస్తాం.

టెట్.. టెన్షన్

(5వ పేజీ తరువాయి)

నియమితులైన టీచర్లకు మినహాయింపు కొనసాగించాలనే వాదన బలంగా వినపడుతోంది. విద్యారంగంలో అనుభవమే గొప్ప అర్హత అని, సీనియర్ టీచర్ల బోధన నైపుణ్యాలను కేవలం టెట్ పరీక్షతో కొలవలేమనే వాదన ఉంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

● సీనియర్ టీచర్ల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే...

సీనియర్ టీచర్ల ప్రయోజనాలను కాపాడటం అత్యవసరమని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. ఇప్పటివరకు నిస్వార్థంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నామని పేర్కొంటున్నారు. అలాంటి వారికి హఠాత్తుగా పరీక్షబారిన పడేలా చేయడం సరైన నిర్ణయం కాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉపాధ్యాయుల తరఫున నిలబడాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుపరంగా ఉపాధ్యాయ నియామకానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసి, గందరగోళం తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యా నాణ్యతను కాపాడేందుకు నిర్ణయా లు తీసుకోవాలే తప్ప సీనియర్ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం తగదని ఉపాధ్యాయ వర్గంలో చర్చ సాగుతోంది. అయితే సుప్రీంకోర్టు నిర్ణయం సబబేనని, టెట్ అర్హత కచ్చితంగా అమలు చేయాలని పలువురు నిరుద్యోగులు వాదిస్తున్నారు.

● జిల్లాలో 3,417 మంది టీచర్లు....

జిల్లాలో గెజిటెడ్, పీఎస్ హెచ్‌ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పండిత్‌లు, ఇతర కేటగిరిల పరిధిలో 3,417 మంది టీచర్లు ఉన్నారు. ఇందులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వచ్చే రెండేళ్ల లోపు సుమారు 1,400 మంది టీచర్ల వరకు టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుందని విద్యాశాఖవర్గాలు అంటున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అయిదు సంవత్సరాలకు మించి సర్వీసు ఉన్న వారందరు రెండు సంవత్సరాల్లో టెట్ పాస్ కావాల్సి ఉంటుంది. లేదంటే ఉద్యోగం నుంచి రిటైర్డు అవాల్సి ఉంటుందని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. అదేవిధంగా ఐదు సంవత్సరాల లోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు పదోన్నతులు పొందాలంటే టెట్ తప్పని సరి కానుంది.

మొరం తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న అధికారులు

-అడ్డుకోవద్దంటూ ఒంటిపై డీజిల్ పోసుకున్న యాజమాని

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్రావ్‌పేట గ్రామ శివారులోని గుండుగుట్ట వద్ద శనివారం రాత్రి అక్రమంగా మొరం తరలిస్తున్న సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు వాహనాలను అడ్డుకున్నారు. దీంతో ఓ వాహన యజమాని ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. దీంతో అటవీ శాఖ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ అక్కడికి వచ్చారు. ట్రాక్టర్లు, జేసీబీ ని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు యత్నించగా యజమానులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులకు, ట్రాక్టర్ యజమానులకు కాసేపు వాగ్వాదం జరిగింది. ఇందిరమ్మ ఇళ్లకే మొరం తరలిస్తున్నామని, అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇవ్వడం లేదని మొరం రవాణాదారులు పేర్కొన్నారు.

ఈసందర్భంగా ఎస్‌ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అనుమతులు తీసుకొని మొరం తరలిస్తే అభ్యంతరం లేదన్నారు. తప్పుడు పనులు చేస్తూ డీజిల్ పోసుకుంటామని బెదిరిస్తే చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించి అక్కడి నుండి వెనుదిరిగారు. కాగ ఈ వ్యవహారంపై అటవీశాఖ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

పదవి పోతుందనే ఫిరాయింపు ఎమ్మెల్యేలు అబద్ధాలు

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :పదవి పోతుందనే భయంతోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలు అబద్ధాలు ఆడుతున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫిరాయింపు ఎమ్మెల్యేల చోరీ అంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గాంధీ ఆకాంక్షలకు సీఎం రేవంత్‌రెడ్డి తూట్లు పొడుస్తుంటే కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాతో పాటు రాహుల్ గాంధీలు మౌనం పాటించడం దుర్మార్గమన్నారు. అభివృద్ధి ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం ఫిరాయింపులకు దారి తెరిచారని పేర్కొన్నారు. పార్టీ మారిన నాయకులు ప్రజలకు చేసిన సంక్షేమమంపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద రావు, గంగాధర్, మల్లేష్, దేవేందర్ నాయక్, సత్యం రావు, వెంకటేశ్వర్ రావు, గంగాధర్, ప్రసాద్, ప్రవీణ్ గౌడ్, రాజన్న, లక్ష్మణ్ రావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దావ వసంత

దుబ్బ రాజన్న ఆలయంలో పూజలు

సారంగాపూర్, సెప్టెంబర్, 13 (ఆంధ్రజ్యోతి) :ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజన్న ఆలయాన్ని ఆర్య వైశ్య కార్పోరేషన్‌చైర్మన్ కాల్వ సుజాత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నూతనంగా నిర్మాణం జరుగుతున్న వాసవి కన్యాక పరామేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. ఆర్య వైశ్య నాయకులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య మహిళ విభాగం అధ్యక్షురాలు దువ్వ లావణ్య రాజు, యాంసాని సంతోష్, ఆయల కమిటీ సభ్యులు, ఆర్య వైశ్య నాయకులు మల్లీ ఖార్జున్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కోరుట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలిన అడ్మీషన్లపై స్పార్ట్ సెలక్షన్ నిర్వహించి సెలక్షన్ చేస్తున్నట్లు, ఇట్టి అవకాశంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సాందీప్ అకాడమిక్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్‌లు కోరారు. శనివారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఏ బీకాం కంప్యూటర్ విభాగాలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ఈ నెల 15, 16వ తేదీల్లో స్పార్ట్ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పార్ట్ సెలక్షన్ కోరకు వచ్చే విద్యార్థులు వెంబడి వారి ఒరిజినల్ సర్టిపికెట్లు, జిరాక్స్ కాపీలతో పాటు పదోవ తరగతి, ఇంటర్ మోమో పత్రాలతో హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



కమిషనర్ రవీందర్‌కు సమస్యలు వివరిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సూచించారు. శనివారం పట్టణం శివారులోని అయ్యేద పట్టణంను మున్సిపల్ కమిషనర్ రవీందర్‌తో కలిసి సందర్శించారు. కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి కాలనీలో నెలకొన్న సమ్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నం అనిల్ కుమార్, తిరుమల గంగాధర్, పుప్పాల ప్రభాకర్, కొంతం రాజం కౌన్సిలర్లు ఎంబేరీ నాగభూషణం, జిందం లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

‘పంట నష్టపరిహారం చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి’

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరద కాలువ నీటిలో మునిగి పంట పొలాల రైతులకు నష్టపరిహారం గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో వరుద కాలువ నీటిలో మునిగి పంట పొలాలను ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు.

ఘనంగా విశ్వకర్మ బ్రహ్మోత్సవాలు

గొల్లపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ గాయిత్రీమాత విశ్వబ్రాహ్మణ సంఘం భవనంలో విశ్వకర్మ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్షులు బలభక్తుల కిషన్, పట్టణ శాఖ అధ్యక్షులు రాజగణేష్, కరుణాకర్, తిప్పర్తి రాజ్ కుమార్, సజ్జనపు రవి పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతిపై విచారణ

వెల్గటూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవ్‌పేటలో విద్యుత్‌శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వేముల నరేష్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై శనివారం గ్రామ పంచాయితీ ఆవరణలో విజిలెన్స్ ఎస్సై ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఇళ్లకు కొత్తగా కరెంట్ కనెక్షన్ ఇవ్వడానికి, మీటర్ బిగించడానికి, వ్యవసాయ మోటార్ కనెక్షన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతీ ఒక్క దానికి డబ్బులు వసూలు చేసేవాడని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందింది. విజిలెన్స్ ఎస్సై ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ నరేష్ అక్రమ వసూళ్లకు పాల్పడ్డట్లు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీకాంత్‌గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ అంబులెన్స్

-పట్టించుకోని వైద్యాధికారులు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలలో ప్రైవేట్ అంబులెన్స్‌లు యథేచ్ఛగా పార్క్ చేస్తున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాల మెట్‌పల్లి పరిసరాలలో ప్రైవైట్ అంబులెన్స్‌లు నిలుపవద్దని వైద్యాధికారి బోర్డులు ఏర్పాటు చేసినా వారు యథేచ్ఛగా పార్క్ చేస్తున్నారు. వీరికి ఆసుపత్రిలో పనిచేసే కొంత మంది సిబ్బంది అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అనుపత్రి సూపరింటెండెంట్ షాజిద్ అహ్మద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ప్రైవేట్ అంబులెన్స్‌లు ఆసుపత్రిలోకి వచ్చేందుకు అనుమతి లేదని, వస్తే గాలి తీసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

‘సేవా పక్షాన్ని’ విజయవంతం చేయాలి

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించే సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు విజయ్, రఘు, లావణ్య, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని అన్ని వార్డుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టణ ప్రబరి పిల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ అన్నారు. స్థానిక శ్రీ కర్నె అక్కపెల్లి కళ్యాణ మండపంలో ధర్మపురి పట్టణ కార్యశాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రబరి పిల్లి శ్రీనివాస్, సేవా పక్షం కన్వీనర్, కో కన్వీనర్లు తిరుమన్‌దాసు సత్యనారాయణ, దివిటి శ్రీధర్, మండలోజు సూరజ్, సీనియర్ నాయకులు స్తంభంకాడి శ్యాంసుందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగి మాధవ్, పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** భారత ప్రధాని నరేంద్రమోడి జన్మదిన వేడుకలను పక్షం రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని బిజెపి నాయకులు కట్ట మహేష్, మర్రిపెల్లి సత్యంలు పేర్కొన్నారు. శనివారం పెగడపల్లి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ సేవా పక్షం కార్యశాల నిర్వహించారు. సమావేశంలో మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూర్య, నాయకులు గంగుల కొమురెల్లి, రవీందర్ రెడ్డి , సాయికృష్ణ, గట్టయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** భారతీయ జనతా పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం మండలంలోని పెంబట్ల పెద్దమ్మ ఆలయ సమీపంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు అనుమల్ల కృష్ణహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్య క్షులు రెంటం జగదీష్‌లు మాట్లాడారు.కార్యక్రమంలో నాయకులు బాస నాగేందర్, రాజేశ్వర్‌రెడ్డి, కంచర్ల నరేష్, గుర్రం భీమన్న, రమేష్, అంజి, వెంకటేష్, సంతోష్, నరేష్, శేఖర్, మల్లేష్, రంగారెడ్డి, నర్సన్న, వంశీ, తిరుపతి, ప్రవీణ్, జగన్ పాల్గొన్నారు.

‘ఎంపీపై అనవసర విమర్శలు’

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌పై బీఆర్‌ఎస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రానికి లేక రాస్తే నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తెరిపించే బాధ్యత తీసుకుంటారని బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ అన్నారు. కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్రలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ శ్రీనివాస్ సేవలు మరవలేనివి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, బీజేపీ పార్టీ అభివృద్ధికి మాజీ సర్పంచ్,పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది మారంపల్లి శ్రీనివాస్ సేవలు మరువలేమని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో మారంపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జంగిటి శ్రీధర్, మేడిచెల్మల రవి, నలిమెల నరసింహారెడ్డి, చింతకుంట దేవేందర్, గాజవేని మహేష్, గంట రాజేశ్వర్, ఏలేటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా శంకర్

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత పెన్షనర్ల సంఘం ధర్మపురి మండల అధ్యక్షుడిగా కొరిడె శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఇందారపు బండయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో శనివారం ప్రభుత్వ విశ్రాంత పెన్షనర్లు సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులుగా ఎండీ వజీర్, విజయలక్ష్మి, కోశాధికారిగా బొజ్జ శంకర్, గౌరవ అధ్యక్షులుగా రాజయ్యను ఎన్నుకున్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నెహ్రూ యువ కేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు (టోర్నమెంట్) శనివారం డిస్ట్రిక్ట్ చైల్డ్ మ్యారేజ్ కో ఆర్డినేటర్ భూమేష్ ప్రారంభించారు. కబడ్డీ విభాగంలో పెద్దనక్కలపేట, రామయ్యపల్లె జట్లు ఫైనల్ చేరుకున్నాయి. కార్యక్రమంలో మై భారత్ జగిత్యాల యువజన వాలంటీర్ మారం గణేష్, ప్రోగ్రాం ఆర్గనైజర్స్ వినోద్, చందు, వెంకటేష్, హరీష్, మల్లికార్జున్, అబీ, రాహుల్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

పెగడపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులను వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి వడ్డేపల్లి భాస్కర్ సూచించారు. శనివారం పెగడపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘం గోదాంలో రైతులకు రసాయనిక ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ , సంఘ సీఈఓ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏవో భాస్కర్

●**వెల్గటూర్:** యూరియా విషయంలో రైతులు ఆందోళన చెంవద్దని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. శనివారం వెల్గటూర్ పీఏసీఎస్‌ను ఆకస్మికంగా సందర్శించి యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్గటూర్ సొసైటీకి 37 టన్నుల యూరియా స్టాక్ వచ్చిందని రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. ఫర్టిలైజర్ దుకాణాలలో కూడా యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు. యూరియా విషయంలో రైతులను ఇబ్బంది పెట్టినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్, సీఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు, పోలీస్‌ల పరస్పర సహకారంతోనే లోక్ అదాలత్‌లు విజయవంతం అవుతాయని మండల్ లీగల్ సర్వీసెస్ కమిటి చైర్మన్, సినియర్ సివిల్ జడ్జీ డి. నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని సినియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, మెట్‌పల్లి పోలీస్‌ల పరస్పర సహకారం వల్ల కోర్టులో అత్యధిక కేసులు రాజీ అవుతున్నాయని తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో 270 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జీ నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసూనురి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోగిటి రాజశేఖర్, అడిషనల్ పిపి చెర్లపల్లి ఆనంద్‌గౌడ్, అసిస్టెంట్ పిపి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే దేవి నవరాత్రోత్సవాల సంబంధించిర కరపత్రాన్ని శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటా నిర్వహించే విధంగా దేవి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందు కోసం తన వంతు సహకారం కూడ అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మ్యాన పవన్‌కుమార్, స్తంభంకాడి మహేష్, వెలగందుల నాగభూషణ, మాన్య అనిల్, అప్పం మల్లేష్, కస్తూరి శరత్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో స్వర్ణకార సంఘం అధ్వర్యంలో నిర్వహించే శ్రీశ్రీశ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని సంఘం పక్షాన మంత్రికి ఆహ్వాన పత్రిక అందించారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్సవాలకు హాజరు అవుతానని తెలిపారు. పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, ఉప్పుల రాకేష్, కట్ట శ్రీహరి, కలికోట రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మెట్ల చిట్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక అధికారిగా ఎండీ అసద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఏస్‌లకు ఎన్ని కైనా పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫ్రిబవరి 14న ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలు పదవీకాలం పాటు పెంచింది. వారి పదవీకాలం ఆగస్టు 14 ముగియడంతో మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కానీ సొసైటీల్లో నిధుల దుర్వినియోగం, అవకతవకలు, అక్రమాలు, నిబంధనలు పాటించకపోవడంతో నియమించిన పాలక వర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసి అందులోని అధికారులకు ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించింది. దీంతో మెట్లాచిట్టాపూర్‌కు ఎండీ అసద్‌ను నిర్వహించగా బాధ్యతలు స్వీకరించగా సీఈవో తిరుపతితో పాటు సిబ్బంది స్వాగతం పలికి శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

మంత్రి అడ్లూరి పరామర్శ

వెల్గటూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కప్పారావు పేటకు చెందిన హైకోర్టు న్యాయవ్యాది గంధ్ర రంగారావు మృతి చెందగా శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రంగారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాస్‌రావు, మద్దుల గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, సుధీర్‌రావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్

గొల్లపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలో నూతనంగా మంజూరైన ఎరువుల గోదాంను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బేర కిషోర్, నాయకులు సిద్దంకి రమేష్, దేవేందర్, గంగయ్య, రైతులు పాల్గొన్నారు.